క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే రాగమయి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో రోడ్లకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను మంగళవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కలిసి వినతిపత్రం అందించారు. పంచాయతీరాజ్ శాఖలో చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని.. మరికొన్ని కొత్తరోడ్లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అదే విధంగా సింగరేణి సీఎండి ఎన్.బలరాంనాయక్‌ను కలిసి సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన పర్యావరణ, అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కిష్టారం గ్రామంలో సైలో బంకర్ వల్ల పర్యావరణ సమతల్యత దెబ్బతిని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కాలుష్య నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయండి



సూచనలు చేస్తున్న వైద్యాధికారి అరుణాదేవి

తల్లాడ/ముదిగొండ: మార్చి 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ముదిగొండ జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ తెలిపారు. తల్లాడ, ముదిగొండ మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. వ్యాక్సినేషన్ ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలకు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్ రామారావు, సీహెచ్‌ఓ దుర్గామల్లేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, వైద్యాధికారి రత్న మనోహర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి స్రవంతి

బోనకల్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి అన్నారు. మండలంలో ఎయిడ్స్ నిర్మూలనపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కళాకారులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమన్నారు. కలుషిత రక్తం, కలుషిత సిరంజీలు వాడడం ద్వారా కూడా ఎయిడ్స్ సంక్రమిస్తుందన్నారు. ఎయిడ్స్ లక్షణాలు ఉన్నవారికి జ్వరం, అలసట వస్తుందన్నారు. ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్, తీవ్రమైన దగ్గు వస్తుందన్నారు. అటువంటి లక్షణాలు కనబడినప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం



నేత్రాలను స్వీకరిస్తున్న సిబ్బంది

పెనుబల్లి: మండలంలోని బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన దొంతు కృష్ణయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యులు మృతుడు దొంతు కృష్ణయ్య కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో దొంతు కృష్ణయ్య నేత్రాలను ఖమ్మం నేత్రనిధి టెక్నీషియన్ నాగేశ్వరరావు ద్వారా సేకరించి ఖమ్మం నేత్రనిధికి అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు నాళ్ల జయరాం తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు దొంతు మాధవరావు, లక్ష్మణరావు, సత్యం, దుర్గారావు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సత్తుపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గౌరిగూడెం మాజీ సర్పంచ్ మండపాటి ముత్తారెడ్డిని రాష్ట్ర రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్‌లో పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ నేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు మువ్వా విజయబాబులతో పాటు ఎండి కమల్‌పాషా, నారాయణవరపు శ్రీనివాసరావు, మట్టా చెన్నారావు, దోమా ఆనంద్, పలువురు పరామర్శించారు.

పరీక్షా కాలం..

- విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు..
- చేతిరాత బాగుంటే మంచి ఫలితం
- కళ్లు జాగ్రత్త సుమా..



సత్తుపల్లిలో పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: విద్యార్థులకు వార్షిక పరీక్షలు కీలకమైనవి.. ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. టెన్త్ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి షురూ కానున్నాయి. పరీక్షల్లో సమాధానాలు అందంగా.. స్పష్టంగా.. గుండ్రంగా రాస్తే జవాబు పత్రాలు దిద్దేవారికి సులువుగా అర్థమౌతుంది. దీంతో పరీక్షల్లో చక్కని రాతతో మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు చదువుతో పాటు చేతిరాతపై దృష్టి పెడితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 28,855 మంది టెన్త్ విద్యార్థులు, 56,017 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ముత్యాల్లాంటి అక్షరాలతో..

కొందరి చేతిరాత ముత్యాలా ఉన్నాయని.. అచ్చుగుద్దినట్లు ఉన్నాయని పోల్చుతారు. ఇంత అందమైన చేతిరాత నిత్య సాధనతోనే సాధ్యమౌతుంది. వరుస క్రమంలో ఒడుదుడుకులు లేకుండా.. కొట్టివేతలు లేకుండా రాయాలి. పరీక్షల ముందు విద్యార్థులు పెన్నులు కొంటుంటారు. అలా కాకుండా కొన్ని రోజుల ముందు నుంచి వాడుతున్న పెన్నులతో పరీక్షలు రాయాలి.

ఆవేదన చెందొద్దు..

ప్రతి విద్యార్థికి పరీక్షలు కీలకం. అన్ని ప్రశ్నలకు సమాధానాలు బాగా రాసినా మార్కులు తక్కువగా వచ్చాయని కొందరు ఆవేదన చెందుతుంటారు. బరువైన పెన్ను వాడితే వేళ్ల మధ్య నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. అందమైన చేతిరాత విద్యార్థుల మార్కులు, గ్రేడ్‌లను నిర్ధారిస్తుందని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

ఒత్తిడి లేకుండా..

ఉదయం ఐదు గంటలకే లేచి ప్రణాళికాబద్ధంగా చదవాల్సిన అంశాలను చదువుకోవాలి. సబ్జెక్టుల లోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు రాస్తుండాలి. బట్టీ పట్టకుండా అర్థం చేసుకుంటూ చదువుతుండాలి. పరీక్షల సమయంలో కంప్యూటర్, టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. పరీక్ష రాసేటప్పుడు ఒత్తిడితో చమట రావటం సహజం. అలా చమట రాకుండా తరచూ చేతులు తుడుచుకుంటూ ఉండాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం అరగంట పాటు యోగా, ధ్యానం చేయటంతో మంచి ఫలితాలు వస్తాయని నిపుణులు చెపుతున్నారు.

కళ్లు జాగ్రత్త సుమా..

పరీక్షల సమయంలో చదువు ధ్యాసలో పడి విద్యార్థులు కళ్లపై ఒత్తిడి పడకుండా జాగ్రత్త వహించాలి. చదువుకొనే సమయంలో సరైన పద్ధతిలో కూర్చోవటం కూడా అవసరమే. నిటారుగా కూర్చోవటం వల్ల మెడ, వీపుపై ఒత్తిడిని నివారించి వెన్ను సమస్యలు రాకుండా ఉపయోగపడుతుంది. తగినంత నిద్ర పోవాలి. విశ్రాంతి లేకపోవటం, తగినన్ని నీళ్ల తాగకపోవటం వల్ల తలనొప్పికి దారి తీస్తుంది. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల గాలి నేరుగా కళ్లపై పడితే కళ్లు పొడిబారుతాయి.

ఆత్మవిశ్వాసంతో చదవాలి..



ఒత్తిడిని దరి చేరనీయకుండా విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాస్తే విజయం సాధిస్తారు. మోడల్ పేపర్‌పై పూర్తి అవగాహనతో ఉండాలి. బిట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆకు కూరలు, పాలు, పండ్లు తీసుకోవాలి.

– నక్కా రాజేశ్వరరావు, మండల విద్యానోడల్ అధికారి, సత్తుపల్లి

గోరువెచ్చని నీరు తాగాలి..



గోరువెచ్చని నీరుతాగితే జలుబు, జ్వరం వచ్చే అవకాశాలు ఉండవు. సరిపడా వెలుతురులో చదువుకోవాలి. కళ్లపై నేరుగా కాంతి పడకుండా పుస్తకాలపై నేరుగా కాంతిపడేలా చదువుకోవాలి. కళ్లు మంటలు, దురదలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ కట్టా శివాజి, నేత్ర వైద్యులు, సత్తుపల్లి

బీజేపీతోనే అన్నివర్గాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

మధిర/బోనకల్: అన్ని వర్గాల ప్రజలతో పాటు దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మధిర, బోనకల్‌లో ఏర్పాటుచేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. దేశం ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెందగా, మరింత అభివృద్ధి కోసం బీజేపీని మరోమారు అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. తెలంగాణలో సత్తా చాటడమే కాక దేశమంతటా కలిపి 400 పార్లమెంట్ సీట్లను బీజేపీ గెలుస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వాన పేదరిక నిర్మూలన, రైతుల అభ్యున్నతికి కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లను పరిశీలిస్తే బీజేపీ చేసిన అభివృద్ధి కనిపిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, చిలువేరు సాంబశివరావు, రామయోగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, గోంగూర వెంకటేశ్వర్లు, బోళ్ల బిక్షపతి, నాగేశ్వరావు, తాళ్లూరి సురేష్, పాపారావు, పాపట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నుల భారం తగ్గించాలి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వైరా: తెలంగాణ రాష్ట్రంలోనే వైరా మున్సిపాలిటీలో ప్రజలపై పన్నుల భారం ఎక్కువైందని తక్షణమే ప్రజలపై ఇంటి పన్నుల భారాన్ని తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం వైరా మున్సిపాలిటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైరా మున్సిపాలిటీకి రూ 98 లక్షల నుంచి రూ.3 కోట్లకు ఇంటి పన్నుల బకాయిల టార్గెట్ విధించడంతో ఇంటిపన్నులు చూస్తే ప్రజలకు గుండె పోటు వస్తుందన్నారు. లాలాపురం, గండగలపాడు, సోమవరం వంటి శివారు గ్రామాల్లో ఇంటిపన్నులు రూ.500 నుంచి రూ.5000 వరకు పట్టణంలో కొన్ని కుటుంబాలకు రూ.8 వేల వరకు పన్నులు విధించినట్లు తెలిపారు. దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడనున్నట్లు తెలిపారు. ఇష్టానుసారం పన్నులు వసూలు చేసి ప్రజలపై భారం మోపవద్దని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పైడిపల్లిసాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన




చింతకాని: సీతంపేటలో శంకుస్థాపన చేస్తున్న గ్రామ మాజీసర్పంచ్‌లు

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.3లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు మంగళవారం కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యరమల వెంకటరెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి భట్టి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి రత్నాలరెడ్డి, కడియం శ్రీనివాసరావు, నందిగం సందీప్, యరమల రమణారెడ్డి, లక్కిరెడ్డి పుల్లారెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, నందిగం మోహన్‌రావు, పుల్లారావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ తదితరులు ఉన్నారు.

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ మాజీసర్పంచ్‌లు ఆళ్ల రవీందర్, నారపోగు కొండలరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. వెంకటేశ్వర్లు, రామయ్య, బాబు, నాగరాజు, యల్లయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

కొణిజర్ల: మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఆలిండియా యూనిటీ మహాసభలకు పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామనర్సయ్యనగర్ లో ఆయన ప్రారంభించిన మోటర్‌సైకిల్ ర్యాలీ.. మల్లుపల్లి, కొణిజర్ల, పెద్దగోపతి, చిన్నమునగాల, పెద్ద మునగాల, గోపవరం, బస్వాపురం, పల్లిపాడు, లాలాపురం, రాంపురం, సింగరాయపాలెం, లక్ష్మీపురం, తీగలబంజర, ఎల్లన్ననగర్ గ్రామాల వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ సంఘ పరివార్‌ను అణగదొక్కాలంటే కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సీవై పుల్లయ్య, కె.అర్జునరావు, పాశం అప్పారావు, నాయకుడు సీతారాములు, లక్ష్మణ్, సుక్కో, శ్రీను, వెంకన్న, రమేష్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, కోటయ్య, సైదా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు రూ. 2.50 కోట్లు మంజూరు

తల్లాడ: సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కృషితో తల్లాడ మండలంలోని సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ. 2కోట్ల 50 లక్షలు మంజూరు అయ్యాయని సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన ఎన్ఆర్ ఈజీఎస్, సింగరేణి ఫండ్స్ నిధులతో ఆయా గ్రామాల్లో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలపారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు దుండేటి వీరారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కటికి కిరణ్, పైడిపల్లి రవి, సామినేని రామప్పారావు, గుర్రం శ్రీనివాసరావు, మువ్వా శరత్, ఉద్యమ నాయకులు వెంకటేశ్వరరావు, రామారావు, నరసింహారావు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఎర్రుపాలెం: అభివృద్ధిని విస్మరించిన బీజేపీ ప్రభుత్వాన్ని త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మంగళవారం మండలంలోని భీమవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకుడు షేక్ జానీమియా చిత్రపటానికి నివాళి అర్పించి పార్టీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి వీరయ్య, నాయకులు కోటేశ్వరరావు, నర్సింహారావు, తిరుపతిరావు, జోగయ్య, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, వెంకటేశ్వరరావు, లాలా, రాములు, నాగేశ్వరరావు, వెంకటనారాయణరెడ్డి, వీరాంజనేయులు, శ్రీహరి, నారాయణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయాలపాలైన వెంకటేశ్వరరావు

పెనుబల్లి: మండలంలోని రంగారావు బంజర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వీవీయంబంజర్ గ్రామానికి చెందిన అటవీశాఖ విశ్రాంత ఉద్యోగి వేముల వెంకటేశ్వరరావు రంగారావుబంజర్‌లోని తన మామిడి తోటకు నీళ్లుపెట్టి తిరిగి ఊరికి వస్తున్న క్రమంలో రంగారావుబంజర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. గమనించిన స్థానికులు వెంకటేశ్వరరావును అంబులెన్స్‌లో పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



వైరా: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు



సత్తుపల్లిటౌన్: ఇన్విజిలేటర్లకు సూచనలు చేస్తున్న దృశ్యం

వైరా/సత్తుపల్లిటౌన్/ఎర్రుపాలెం/కల్లూరు: వైరా, సత్తుపల్లి పట్టణాలతో పాటు ఎర్రుపాలెం, కల్లూరు మండలంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు కళాశాల యాజమాన్యాలు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇన్విజిలేటర్లకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. సత్తుపల్లి పట్టణంలో ఏడు కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 1,664 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,353 మంది పరీక్షలకు హాజరు కాగా.. వైరా పట్టణంలో నాలుగు కళాశాలల్లో 815 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి రోజు తెలుగు, ఉర్దూ, హిందీ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఓ విద్యార్థి సహాయకురాలితో పరీక్షలకు హాజరు కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు, గురుకుల కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 293 మంది, ద్వితీయ సంవత్సరంలో 273 మంది పరీక్షలకు హాజరు కానున్నారని ఆ కళాశాలల ప్రిన్సిపల్స్ ఎస్.రమణారెడ్డి, ఎం.పద్మావతి తెలిపారు. ఈ కళాశాలల్లో నిర్వహించే పరీక్ష కేంద్రాలకు సూపరింటెండెంట్‌లుగా ఎస్.రమణారెడ్డి, ఎం.పద్మావతి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా జి.విక్రమ్, కమల వ్యవహరించనున్నారు. కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షలకు ప్రథమ సంవత్సరంలో 338 మంది, ద్వితీయ సంవత్సరంలో 324 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎస్‌కే అతహార్ అలీ, కె.శ్రీలతలు తెలిపారు. ఈ కళాశాలలకు డీఓలుగా ఐ.వెంకటేశ్వరరావు, సతీష్‌చంద్రలు వ్యవహరిస్తున్నారు.



ఎర్రుపాలెం: గురుకుల కళాశాలలో..



కల్లూరు జూనియర్ కళాశాలలో..

'పది' పరీక్షలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న సాధిక్ అలీ

కల్లూరు: కల్లూరు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్‌కే సాధిక్ అలీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పది పరీక్షల్లో 10/10 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులకు ప్రతి విద్యార్థికి రూ.25 వేలు చొప్పున అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంగ్లీష్ భాష ప్రావీణ్యం పెంపొందించడానికి విద్యార్థుల్లో ప్రేరణ కలిగించడానికి బుక్స్ అందించడం జరిగింది. విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.పద్మ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎమ్ సున్నా కృష్ణయ్య, పీఈటీ పి.వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



రాధారుక్మిణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చింతకాని: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల హెచ్‌ఎం కర్నాటి కవిత అన్నారు. మండలంలోని చినమండవ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులే ఉత్తమ ర్యాంక్‌లను సాధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులు పాఠశాలకు నాలుగు కుర్చీలను వితరణగా అందజేశారు. అలాగే పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు రాధారుక్మిణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోటకూరి శ్రీనివాసరావు, వసంద, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేందర్

ఎర్రుపాలెం: గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని ఎంపీడీఓ బి.సురేందర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ జాబ్ కార్డు కలిగి ఉండి పని కోరిన కూలీలకు విధిగా పనులు కల్పించాలన్నారు. కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని, నర్సరీలలో విత్తనాలు 100శాతం మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి గంధం శ్రీలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ కోలకంటి నాగరాజు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

అన్నారుగూడెంలో పల్లకీ సేవ, ఊరేగింపు



పల్లకీ సేవలో ఆలయ కమిటీ చైర్మన్, గ్రామస్తులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో వారం షిరిడీ సాయిబాబా ఆలయం 16వ వార్షికోత్సవం సందర్భంగా పల్లకీసేవ, ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కోలాట బృందాలతో కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ మారెళ్ల లక్ష్మణ్‌రావు, నాయకులు తుమ్మలపల్లి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పల్లకిని మోశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 28న సాయిబాబా మందిర వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారెళ్ల మమత, తుమ్మలపల్లి సత్యనారాయణ, రాయల వెంకటయ్య, పొన్నం కృష్ణయ్య, దుగ్గినేని గోపయ్య, నున్నా సాందీపులు, పునాటి సత్యనారాయణ, పాపినేని మదుసూదన్‌రావు, ఆపతి రామారావు, మల్లీడు వెంకటేశ్వర్లు, శేషయ్య, మారెళ్ల వెంకటేశ్వర్‌రావు, పసుమర్తి పుల్లారావు పాల్గొన్నారు.

విశ్వధర్మక్షేత్రంలో ప్రత్యేక పూజలు



బుగ్గపాడులో పూజలు చేస్తున్న మువ్వా విజయ్‌బాబు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడు గ్రామంలో ప్రముఖ ఆగమ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలోని విశ్వధర్మ క్షేత్రం ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మంగళవారం మూడో రోజు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు తియ్యబిండి కల్యాణ్‌కుమార్ ఆచార్యులు, అత్తలూరి బాలశంకర్‌శాస్త్రి, నాగేశ్వర శర్మ, శ్రీరాం ప్రసాద్, ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న పాలకమండలి సభ్యులు

కల్లూరురూరల్: కల్లూరులోని కాశ్మీరా మహాదేవ క్షేత్రం(అప్పయ్య స్వామి) శివాలయంలో మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న శివ కల్యాణం జాతర ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎంపికైన దేవాలయ పాలకవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతర, శివ కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భారీ కేడ్లు నిర్మించాలని అదే విధంగా విద్యుత్ దీపాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ నూతన చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, సభ్యులు నరసింహారావు, శ్రీనివాసరావు, బుర్రి వీరయ్య, ఆలయ ఈఓ ఎస్‌వీడి ప్రసాద్ పాల్గొన్నారు.